సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 5 । మే । 2024



పేదలకు ఆరోగ్య భరోసా

అందరికీ ఆరోగ్యాన్ని అందించడం తొలి ప్రాధాన్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తరచూ చెబుతుంటారు.

- 8లో



ప్రగతిరథ చోదకులకు వాహనమిత్ర

దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రగతిలో రవాణా రంగానిదే కీలకపాత్ర. అందులో లారీలు ప్రముఖ స్థానం.

- 8లో



గంగన్నపాడులో అగ్ని ప్రమాదం

గంగన్నపాడులో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పశువుల శాలలు దగ్ధం కావడంతో పాటు, ఓ ఆవు మృతి చెందింది.

- 8లో

న్యూస్‌రీల్

అయ్యో 'పాప'ం

- శ్లాబ్ పెచ్చులు పడి పసికందు మృతి



మృతి చెందిన పసికందు వంశిక

పాలకొండ: మూడు నెలల పసికందు..రాత్రంతా తల్లి పక్కన హాయిగా పడుకుంది. తెల్లవారగానే తల్లి ఇంటిపనుల కోసం లేవగా చిన్నారి ఇంకా నిద్రలో ఉంది. అంతలోనే ఇంటి శ్లాబ్ రూపంలో మృత్యువు పసికందును పొట్టన పెట్టుకుంది. తన కళ్ల ముందే శ్లాబ్ పెచ్చుపడి పసికందు మృతి చెంద డంతో తల్లి హృదయం తల్లడిల్లింది. ఈ విషాద ఘటన పాలకొండ మండలంలోని వెలగవాడలో శనివారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కేవటి సంజీవు, మంజుల దంపతులకు మూడు నెలల క్రితం పాప పుట్టింది. ఆ పాపక వంశిక అని నామకరణం చేశారు. సంజీవు హైదరాబాద్‌కు వలస కూలీగా వెళ్లి అక్కడే పనులు చేసుకుంటున్నాడు. పాప చిన్నవయస్సు కావడంతో మంజుల గ్రామంలోనే ఉండి పనులు చూసుకుంటోంది. ఎప్పటిలాగానే శుక్రవారం రాత్రి పసికందును పక్కన వేసుకుని బయట వరండాలో చాపపై పడుకుంది. తెల్లవారడంతో మంజుల లేచి ఇంటిపనుల్లో ఉండగా పసికందు అక్కడే పడుకుంది. ఆ సమయంలో ఇంటి శ్లాబ్ పెచ్చు ఊడి తలపై పడడంతో చిన్నారి అక్కడికక్కడే మరణించింది. ఈ సంఘటనతో తల్లి మంజుల సొమ్మసిల్లిపడిపోయింది. ఇరుగుపొరుగు వారు వచ్చి సపర్యలు చేసి ఈ సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

పింఛన్ల పాపం చంద్రబాబు కూటమిదే

- పీడిక రాజన్నదొర



రెండు నెలలుగా పింఛన్లు అందలేదని రాజన్నదొర వద్ద వాపోతున్న వృద్ధ దంపతులు

పాచిపెంట: పింఛన్లు ఇంటి వద్ద అందకుండా లబ్ధిదారుల ఉసురు పోసుకున్న పాపం చంద్రబాబు, ఆయన మాయా కూటమిదేనని వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాచిపెంట మండలంలోని పణుకువలస పంచాయతీ పెదచీపురువలస గ్రామానికి వెళ్లిన ఆయన అక్కడ మంచంపై కదల్లేని స్థితిలో ఉన్న వృద్ధురాలు కన్నమ్మను చూశారు. రెండు నెలలుగా మాకు ఇంటికి వచ్చి పింఛన్ అందించడం లేదని, ఇంటికి వచ్చి అందించేలా చొరవ తీసుకోవాలని ఆమె రాజన్నదొరను కోరింది. దీనిపై చలించిన ఆయన మాట్లాడుతూ, వచ్చే నెల మీ బిడ్డ జగనన్న ప్రభుత్వం కొలువుదీరుతుందని వలంటీర్లు యథావిధిగా ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తారని, అధైర్యపడొద్దని భరోసా కల్పించారు.

ప్రచారహోరులో భానుడి ప్రతాపం

- డీహైడ్రేషన్‌కు గురై సేదదీరిన కళావతి



ప్రచార క్రమంలో సేదదీరుతున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి

పాలకొండ రూరల్: ఉప్పొంగుతున్న ప్రజాదరణతో ఎండతీవ్రతను పక్కనపెట్టిన వైఎస్సార్‌సీపీ పాలకొండ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి ప్రజలతో మమేకమయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం పాలకొండ మండలంలోని ఎల్ఎల్.పురం గ్రామంలో ప్రచారం చేస్తున్న సమయంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు, కార్యకర్తలు ఒకింత అలసి, చెమట పట్టారు. అయినా కళావతి తన ప్రచారం కొనసాగిస్తూ, కార్యకర్తలను ఉత్సాహ పరుస్తూ ముందుకు కదిలారు. దీంతో కోపగించిన భానుడు తన తీవ్రతను పెంచడంతో కళావతి డీహైడ్రేషన్‌కు గురయ్యారు. తన వెంట నడుస్తున్న ప్రజలు, కార్యకర్తలను దృష్టిలో పెట్టుకుని కొద్ది సమయం ప్రచారానికి విరామం పలికారు. ఆ సమయంలో గడ్డివాము వద్ద ఓ టార్పాలిన్ వేసి సేదతీరే క్రమంలో అన్నీ మరిచి చిన్నగా నిద్రలోకి వెళ్లారు. నిత్యం ప్రజల మధ్య ఉండే తమ నాయకురాలు నిడారంబరంగా నిద్రిస్తున్న తీరు కల్మషం ఎరుగని ఆమె స్వభావానికి అద్దం పట్టిందని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు చర్చించుకున్నారు. కాసేపు తర్వాత రెట్టించిన ఉత్సాహంతో ప్రచారం సాగించారు.

ఇంట గెలవని రాణి..!



ఆమెది ఒంటెత్తు పోకడ వ్యవహారమన్న ఆరోపణలున్నాయి. ఎమ్మెల్సీగా పదవి అనుభవించినా సంతృప్తి లేదు. ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి కావాలన్నదే ఆమె లక్ష్యం. అయితే సొంత పార్టీలోని మాజీ ఎమ్మెల్యేతో ఇప్పటికీ విభేదాలే. కూటమి కట్టి పోటీ చేస్తున్నప్పటికీ..కూటమి పార్టీ ఎంపీ అభ్యర్థితోనూ సఖ్యత అంతంతమాత్రమే. నియోజకవర్గంలోని మూడు మండలాల్లోనూ ఆమెను వ్యతిరేకించేవారే ఉన్నారని సొంతపార్టీ నాయకులే చెప్పుకుంటారు. ఆమె ధోరణి, వ్యవహార శైలిపై అసంతృప్తితో ఉన్న నాయకులు, కార్యకర్తలు పలుమార్లు పార్టీ అధిష్టానం వద్ద పంచాయితీ పెట్టిన ఉదంతాలూ ఉన్నాయి. మక్కువ మండలంలోని ఆమె వ్యతిరేక వర్గం..కేవలం కూటమి ఎంపీ అభ్యర్థికి మాత్రమే అనుకూలంగా ప్రచారం చేస్తున్నట్లు సమాచారం. పాచిపెంట మండలంలోనూ పార్టీ కేడర్‌కు గతంలో ఆమెతో విభేదాలున్నాయి. పార్టీలోని సొంత వర్గీయులే కాదు..వ్యతిరేక వర్గం వారైనా తలెగరేస్తే పాతాళానికి తొక్కేసే వరకూ ఆమె నిద్రపోరనే ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఆమె వైఖరిని ఖండిస్తూ గతంలో సొంత పార్టీ నేతలే సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం గమనార్హం. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఇవన్నీ చాలదన్నట్లు కులవివాదాన్నీ ఎదుర్కొంటున్నారు. ఇలా ఇంటా బయటా వ్యతిరేకతను కూడగట్టుకున్న తెలుగుదేశం పార్టీ సాలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి..ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్తారో అన్న చర్చ సాగుతోంది.

-సాక్షి, పార్వతీపురం మన్యం



- ఒంటెత్తు పోకడలతో సొంత పార్టీలోనే వైరివర్గం
- ఆరేళ్ల ఎమ్మెల్సీ పదవీకాలం.. కొబ్బరికాయలు కొట్టడానికే పరిమితం
- నియోజకవర్గం అభివృద్ధికి చేసింది శూన్యం
- సొంత మండలాన్నీ పట్టించుకోని పరిస్థితి
- సహకరించని పార్టీ క్యాడర్



సంధ్యారాణి

సాలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి ఏమైనా ఉందా అని భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. తనకు ఎమ్మెల్యేగా అవకాశమిస్తే అది చేస్తా..ఇది చేయిస్తా అంటూ టీడీపీ తరఫున ఎన్నికల బరిలో దిగుతున్న గుమ్మిడి సంధ్యారాణి కొద్దిరోజులుగా ఊదరగొడుతున్నారు. కనీసం తాను ఎమ్మెల్సీగా పదవిని అనుభవించిన ఆరేళ్ల కాలంలో ఏం చేశారో చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ హయాంలో ఆరేళ్లు ఎమ్మెల్సీగా చేసినా నియోజకవర్గానికి ఆమె చేసింది శూన్యం. తాగునీరు, ఇతర అవసరాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేశామని ఆమె చెబుతుంటే అధికార పార్టీ నేతలు అడిగిన ప్రశ్నలకు తిరిగి సమాధానం ఇవ్వలేకపోతున్నారు. కనీసం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నా స్పందించడం లేదు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే ఆమె ఎమ్మెల్సీగా పదవిని అనుభవించారు. పదవిలో ఆమె ఉన్నది ప్రజల శ్రేయస్సు కాదని, ఆమె స్వలాభం కోసమేనని సొంత పార్టీ నేతలే విమర్శిస్తుంటారు. సాలూరులో ఆటోనగర్‌ను అభివృద్ధి చేస్తామని, లారీ పరిశ్రమను ఆదుకుంటామని స్వయంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయాంలో హామీ ఇచ్చారు. బైపాస్ రోడ్డును పూర్తి చేస్తామని చెప్పినా చేయలేదు. ఈ ప్రాంత ఎమ్మెల్సీగా వాటి సాధన కోసం ఆమె ఏనాడూ పట్టుబట్టలేదు. టీడీపీ హయాంలో ఏజెన్సీలో గిరిజనుల మరణాలు అధికంగా సంభవించాయి. ఒక్క కరాసవలసలోనే డెంగీ జ్వరాలతో 10 రోజుల వ్యవధిలో 11 మంది వరకు చనిపోయారు. కొదమ పంచాయతీ గిరిశిఖర సిరివర గ్రామం నుంచి డోలీలో గర్భిణిని తీసుకువస్తే..మార్గమధ్యంలోనే ఆమె ప్రసవించింది. దీంతో మానవహక్కుల సంఘం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది.

ఎన్నికల ముందు హడావుడి

సాలూరులో వంద పడకల ఆస్పత్రికి 2019 ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి సుజయ్ కృష్ణ రంగారావుతో కలిసి సంధ్యారాణి హడావుడిగా భూమి పూజ చేశారు. తర్వాత పట్టించుకోలేదు. కందుల పథం బ్రిడ్జికి కూడా ఎన్నికలకు ముందు కొబ్బరికాయ కొట్టి పనులు చేయకుండా వదిలేశారు. సొంత మండలాన్నే ఆమె ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని..ఇంక నియోజకవర్గాన్ని ఏం పట్టించుకుంటారని 'తెలుదేశం పార్టీలోని ఓ వర్గం ప్రశ్నిస్తోంది. తన పదవీ కాలంలో అంటీముట్టనట్లుగానే ఆమె కాలం గడిపేశారని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు తాము కూడా అలాగే ప్రవర్తిస్తామని ఆ పార్టీ నేతలు, క్యాడర్ చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది.

తొలి ఓటు నేడే

- నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్
- 6, 7, 8వ తేదీల్లో హోమ్ ఓటింగ్

సాక్షి, పార్వతీపురం మన్యం: సార్వత్రిక ఎన్నికలు-2024కు సంబంధించి తొలి ఓటు ఈ రోజే పడనుంది. ఎన్నికల్లో విధుల్లో ఉండే పీవో, ఏపీవో, ఓపీవో, ఇతర సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఈ నెల 5, 6, 7వ తేదీల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్ అవకాశం కల్పించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఓటు కలిగి ఉండి, జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు వారి నియోజక వర్గాల్లోనే పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఇందుకోసం వారి సొంత నియోజకవర్గాల్లోనే ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫారం 12, ఫారం 12-డి సమర్పించిన ఉద్యోగులకు ఓటు హక్కు కల్పించారు.

- కురుపాం నియోజకవర్గానికి సంబంధించి కురుపాంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో ఓటు వేయవచ్చు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగి కచ్చితంగా ఓటరు కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డుతో పాటు ఎన్నికల విధులకు హాజరవుతున్నట్లు జారీ అయిన ఉత్తర్వులు వెంట తీసుకురావాలి.
- పార్వతీపురం అసెంబ్లీకి సంబంధించిన ఉద్యోగులు పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో 5వ తేదీన ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల్లోపు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చు. ఎన్నికల విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరో తేదీన, అత్యవసర(ఎసెన్షియల్) సర్వీసు వారు ఏడో తేదీన ఇదే సమయంలో ఇక్కడ ఓటు వేయాలి.
- పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి పాలకొండలోని ప్రభుత్వ హైస్కూల్ వద్ద ఐదు సెంటర్లు ఏర్పాటు చేశారు. 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఇక్కడ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో వెళ్లవచ్చు.
- ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి, ఈ జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులకు 5, 6 తేదీల్లో ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.



రేపటి నుంచి హోమ్ ఓటింగ్

నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కొత్తగా అమల్లోకి తీసుకొచ్చింది. జిల్లాలో ఈ ప్రక్రియ 6వ తేదీన ప్రారంభమై ఎనిమిదో తేదీ వరకూ సాగుతుంది. అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో తాజా ఓటరు జాబితా ప్రకారం 15,54,633 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు 6,623 మంది కాగా..దివ్యాంగులు 21,894 మంది ఉన్నారు. ప్రతి సారీ వృద్ధులు, దివ్యాంగులు కేంద్రాలకు వచ్చి ఓటు వేయడం కష్టతరమవుతోంది. ఆ ప్రభావం పోలింగ్ శాతంపై పడుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సారి పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడానికి అవకాశం లేని 85 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతం వికలాంగత్వం దాటిన విభిన్న ప్రతిభావంతులకు వారి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ఫారం-12 డి ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. అధికశాతం మంది హోమ్ ఓటింగ్‌కు సానుకూలత వ్యక్తం చేయకపోవడం గమనార్హం. మొత్తంగా మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు 3,900 మంది ఉండగా..270 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దివ్యాంగులు 12,247 మంది ఉండగా..383 మంది దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గాల వారీగా పార్వతీపురంలో 273 మంది, సాలూరులో 167, పాలకొండ 116, కురుపాంలో 36 మంది ఉన్నారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీలోపు అధికారులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు తీసుకుంటారు. దీనికోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

శతశాతం ఓటింగ్ లక్ష్యం

విజయనగరం అర్బన్: జిల్లాలో శతశాతం ఓటింగ్ సాధించాలన్నదే ఎన్నికల కమిషన్ లక్ష్యమని ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్ చెప్పారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నామని, ప్రతి ఓటరు తమ ఓటును నిర్భయంగా వినియోగించు కోవాలని కోరారు. ఓటర్లకు మరింత వెసులబాటు కల్పించడంలో భాగంగా ఈ ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని గంటపాటు పెంచినట్టు చెప్పారు. ఓటర్ల చైతన్య కార్యక్రమం స్వీప్‌లో భాగంగా నగరంలోని రాజీవ్ స్టేడియం నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు శనివారం నిర్వహించిన రెండు కిలోమీటర్ల పరుగును ఆయన ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ స్టేడియం వద్ద ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో 85 ఏళ్లు వయస్సు నిండిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే తమ ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, మే 7 నుంచి 10వ తేదీ వరకు హోం ఓటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారు ఓటు వేయడంపై దృష్టి సారించామన్నారు. పరుగులో పాల్గొన్న వారితో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

అలుపు లేదు మనకు.. గెలుపు పొందు వరకూ..!



పాచిపెంట: మంచాలవలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ సాలూరు అభ్యర్థి పీడిక రాజన్నదొర

ప్రచార పర్వం

గడిచిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రకటించిన 'నవరత్నాలు' మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత మాది. మాట ఇచ్చి తప్పడంఅన్న మాటే లేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదలు, మహిళలు, రైతుల పక్షపాతి. ఆయన బాటలో మేమూ నడుస్తూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేశాం. ఎవరికి ఎటువంటి సమస్య ఉన్నట్లు అర్జీ అందజేసిన వెంటనే గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పరిష్కరించాం. మేము ప్రజా సేవకులం. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం. ప్రభుత్వ సేవలన్నీ ఒకే చోట లభించేలా మా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టింది. గ్రామాల్లోనే ఆరోగ్య సేవలు అందించేలా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తోంది. మళ్లీ మరింతగా ప్రజాసేవ చేసేందుకు తమకు అధికారం ఇవ్వాలని, జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా ఆశీర్వదించి తమకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అధికార పార్టీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు అభ్యర్థిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో వారు చేస్తున్న ఎన్నికల ప్రచారానికి ఆదరణ లభిస్తోంది. గ్రామాల్లోకి అభ్యర్థులు ప్రచారానికి వెళ్తున్న సమయంలో ఘనంగా స్వాగతం పలుకుతు న్నారు. అభ్యర్థులకు హారతులిచ్చి ఆశీర్వదిస్తున్నారు. మళ్లీ మీదే గెలుపంటూ భరోసా ఇస్తున్నారు.

-సాక్షి నెట్‌వర్క్



ఎన్నికల ప్రచారంలో ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి



పార్వతీపురంటౌన్: చినబొండపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు



కొమరాడ: చినఖేర్జలలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పుష్పశ్రీవాణి

హలో..ఓటెయ్యాలి..రండి..!

- వలస ఓటర్లపై అభ్యర్థుల ఆశలు
- ప్రతి ఓటు కీలకంగా భావిస్తున్న ప్రధాన పార్టీలు
- ఒకరోజు ముందే వచ్చేలా రవాణా ఏర్పాట్లు
- గ్రామాల్లో వేడెక్కిన రాజకీయం



వీరఘట్టం: సార్వత్రిక ఎన్నికలు సమీస్తుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ముమ్మర ప్రచారం చేస్తుండగా వారికి మద్దతుగా కార్యకర్తలు కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. అయితే ఓటర్లను కూడగట్టడం వ్యయప్రయాసాలతో కూడుకున్న పని. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమని, ప్రధాన పార్టీల అభ్యర్థులు భావిస్తున్నారు. ఎన్నికల తేదీ సమీస్తుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు వలస ఓటర్లపై దృష్టి సారించారు. గెలుపు ఆశతో ఉన్న అభ్యర్థుల తరఫున బాధ్యతలు తీసుకున్న ఆయా పార్టీల నియోజకవర్గం బాధ్యులు ప్రతి ఓటరును కలిసేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో స్థానికంగా ఓటు హక్కు కలిగి ఉండి ఉపాధి,ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. వారి బంధువులు, స్నేహితులు, తమ అనుచరులతో వలస ఓటర్ల ఫోన్ నంబర్లు సేకరించి వారితో మాటలు కలుపుతున్నారు. హలో..మే 13న ఎలక్షన్ ఉందికదా..త్వరగా వచ్చేయండి. ఒకరోజు ముందుగానే ఊరికి వచ్చేలా రవాణా ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరగా వచ్చేయండి అంటూ ఫోన్లు చేస్తున్నారు.

జిల్లాలో సుమారు 25 వేల మంది వలస ఓటర్లు

పార్వతీపురం మన్యం జిల్లాలో 7,75,598 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో సుమారు 25 వేల మంది ఓటర్లు ఉపాధి, ఉద్యోగాల కోసం తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలలోని హైదరాబాద్, రాయగడ, బరంపురం తదితర ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు వెళ్లారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ముఖ్యంగా కురుపాం, పార్వతీపురం ప్రాంతాల్లో వలస ఓటర్ల ప్రభావం ఎక్కువగా ఉంది. మే 13 జరగనున్న పోలింగ్‌కు ఈ ఓటర్లను ఎలాగైనా తీసుకువచ్చేందుకు ప్రధాన పార్టీలు కసరత్తు చేస్తున్నాయి.గత సార్వత్రిక ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కూడా వలస ఓటర్లు జిల్లాకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వలస ఓటర్లు ఉన్న గ్రామాలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు వారిని ఓటింగ్‌కు తీసుకురావడానికి అన్ని చర్యలూ చేపడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వలస ఓటర్లను రప్పిస్తే తమ విజయావకాశాలు మెరుగుపడతాయనే ఆలోచనలో ఓటమి భయంతో ఉన్న టీడీపీ అభ్యర్థులు ఇప్పటికే వలస ఓటర్లతో సంప్రదింపులు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

మృతుడి ఆచూకీ లభ్యం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి - నెలివాడ గ్రామాల మధ్య గల రైల్వే పట్టాల నడుమ ఈ నెల 2న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని రైల్వే పోలీసులు గుర్తించి దర్యాప్తు నిర్వహించారు. మృతుడు బొండపల్లి మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన మామిడి అప్పలనాయుడు(30) గా గుర్తించినట్లు రైల్వే హెచ్‌సీ కృష్టారావు శనివారం తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు చెప్పారు. బంధువులు మృతదేహాన్ని గుర్తించడంతో పంచనామా నిర్వహించి అప్పగించినట్లు తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



చీపురుపల్లి: మద్యం బాటిళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేసిన ఎస్ఐ

చీపురుపల్లి: మండంలోని కర్లాం సమీపంలో 106 మద్యం బాటిళ్ల అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు చెప్పారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో జి.సిగడాం మండలంలోని బాతువ గ్రామానికి చెందిన పైడిరాజు 106 మద్యం బాటిళ్లు రవాణా చేస్తుండగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేశామన్నారు.

జామిలో...

జామి: మండల కేంద్రమైన జామి శివార్లలో ఎన్నికల ఫ్లయింగ్ స్కాడ్ సిబ్బంది తాండ్రంగి గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం బాటిల్స్ పట్టుకెళ్తున్న సమయంలో అతని నుండి మొత్తం 40 మద్యం బాటిళ్ల పట్టుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.6వేలు ఉంటుందని ఎస్ఐ వీరబాబు తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

బొబ్బిలి : పట్టణంలోని యుద్ధ స్థంభం, పాత బొబ్బిలి మధ్య చెరువు గట్టుపై ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నట్టు గుర్తించామని ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ విలేకర్లకు తెలిపారు. మృతురాలి వయస్సు 45 - 50 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతదేహం పక్కనే చుట్టలు, లైటర్, గ్లూకోజ్, పచ్చడి సీసా ఉన్నాయన్నారు. పసుపు రంగు జాకెట్టు, పువ్వుల చీర ధరించి ఉందన్నారు. మూడు రోజుల క్రితం మృతి చెందినట్టు భావిస్తున్నామని, ఖననం చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు వెంకటరమణ(ఫైల్)

బాడంగి: చెడు వ్యసనాలకు బానిసై, అప్పుల పాలైన ఓ యువకుడు జీవితంపై ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి బొబ్బిలి రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. బాడంగి మండలం కోటిపల్లికి చెందిన బోను వెంకటరమణ (21) గుర్తు తెలియని రైతు కింద పడి శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. తల్లిదండ్రులు రమణమ్మ, శంకరరావు సమాచారం మేరకు వెంకటరమణ కొన్నాళ్లుగా రాజమండ్రి దగ్గర చేపల చెరువు వద్ద పని చేసేవాడు. 15 రోజుల కిందట ఇంటికి వచ్చి తిరిగి వెళ్లలేదు. తాగుడు, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చే దిక్కు లేక రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపారు. సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పశువులశాలల దగ్ధం

- రూ.4లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గేదె

లక్కవరపుకోట: మండలంలోని క్లోపల్లి గ్రామంలో మడ్డు ఈశ్వరరావు, మడ్డు మంగలకు చెందిన పశువులశాలలు శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు కాలిపోయాయి. రోజులాగే శుక్రవారం రాత్రి పశువులకు మేత వేసి పాకల్లో కట్టి ఇళ్లకు రైతులు వెళ్లిపోయారు. రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పక్కనే ఉన్న పశువుల శాలలు క్షణాల్లో కాలిపోయాయి. ప్రమాదంలో మంగకు చెందిన ఒక గేదె మృతి చెందగా మరొక గేదె తీవ్రంగా కాలిపోయింది. ఈశ్వరరావుకు చెందిన రెండు గేదెలు మృతి చెందగా మరొక గేదె శరీరం పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 4 లక్షల ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. గాయపడిన పశువులకు మల్లివీడు పశువైద్యాధికారి మండల తులసి వైద్యసేవలను అందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

పేదలకు ఆరోగ్య భరోసా

- ఆరోగ్య శ్రీ సేవలు విస్తృతం
- ప్రతి ఒక్కరి మొబైల్‌లో యాప్
- 2,11,598 హెల్త్ కార్డుల పంపిణీ
- ఐదేళ్లల్లో 75,379 మందికి వైద్యం
- వెచ్చించిన మొత్తం 148.91 కోట్లు



యాప్ డౌన్‌లోడ్‌పై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు(ఫైల్)



పార్వతీపురంటౌన్: అందరికీ ఆరోగ్యాన్ని అందించడం తొలి ప్రాధాన్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తరచూ చెబుతుంటారు. అయితే ఈ మాటలను ఆయన చేతల్లోనూ చూపించారు. అందుకు అనుగుణంగా వైద్య, ఆరోగ్యశాఖపై గతంలో లేనంతగా దృష్టిసారించారు. ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడం తోపాటు కొత్త పీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో పాటు వినూత్నంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన విషయం తెలిసిందే. దీంతోపాటు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ప్రతి ఒక్కరికీ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఆపద్బాంధవిగా నిలిచింది. ఈ పథకంలో గతంలో 1,059 చికిత్స విధానాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 3,257కు పెంచింది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. ఈ పథకాన్ని సామాన్యుడికి చేరువ చేయడం తోపాటు ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి మొబైల్‌లో డౌన్‌లోడ్ చేయించారు. ఇందుకోసం వైద్యశాఖ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. గ్రామ, వార్డు వలంటీర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య శ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

75,379 మందికి రూ. 148.91 కోట్లతో వైద్యం

ముఖ్యంగా గిరిజన ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు ముమ్మరం చేశారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతోమందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యాన్ని అందించారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాలో ఆరోగ్యశ్రీ ద్వారా 75,379మందికి రూ. 148.91 కోట్లతో పేదలకు వైద్యసేవలందించి ఆరోగ్య భరోసా కల్పించారు.

2,11,598 ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా రెండు విడతల్లో 2,11,598 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 350 సచివాలయాల పరిధిలో కార్డుల పంపిణీ చేపట్టారు. సచివాలయాల పరిధిలో ఆరోగ్యశ్రీ కార్డులు లేనివారికి తక్షణమే కార్డులు అందజేశారు.

యాప్‌తో ఎంతో మేలు

ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. ఈ పథకం సేవలు పరిధి ఏ మేరకు ఉంది, ఏఏ వ్యాధులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేసుకోవచ్చు, నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలను ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్‌లో తెలుసుకోవచ్చు. ఎవరైనా ప్రమాదాలకు గురైనా, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న యాప్ ఉంటే ఎవరి ప్రమేయం లేకుండా యాప్ ద్వారానే కావాల్సిన సమాచారం అందుతుంది. ఈ యాప్ డౌన్‌లోడ్ ప్రక్రియను ముమ్మరంగా చేపడుతున్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ యాప్‌ల డౌన్‌లోడ్ లక్ష్యం 2,80,417 లక్షలు కాగా రెండు నెలల్లో శతశాతం డౌన్‌లోడ్ ప్రక్రియ పూర్తి చేశారు.

జిల్లాలో అందించిన సేవలు

నియోజకవర్గం	అందించిన సేవలు	వెచ్చించిన మొత్తం
కురుపాం	19,963	రూ.37.56 కోట్లు
సాలూరు	15,405	రూ.32.55 కోట్లు
పార్వతీపురం	22,277	రూ.44.95 కోట్లు
పాలకొండ	17,734	రూ.33.85 కోట్లు
మొత్తం	75,379	రూ.148.91 కోట్లు

గతంలో చిన్నచూపు

గతంలో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం అంటే చిన్న చూపు చూసేవారు. జగన్‌బాబు అధికారంలోకి వచ్చిన తరువాత నాకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డు ఇచ్చారు. మా వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి సమస్యలు గుర్తించారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించారు. అటువంటి నాయకుడు మాకు మళ్లీ కావాలి.

-బి. మణి, ఆరోగ్యశ్రీ లబ్ధిదారు, పార్వతీపురం

గతంలో వైద్యానికి డబ్బులు ఖర్చయ్యేవి



గతంలో వైద్య అవసరాల నిమిత్తం డబ్బులు చాలా ఖర్చయ్యేవి. జగన్ బాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్ల వద్దకే వచ్చి వైద్యం అందిస్తున్నారు. నా కాళ్లకు ఆపరేషన్ అవసరమని, రూ.30 వేలు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా నాకు ఉచితంగా ఆపరేషన్ చేశారు. జగన్ బాబు ప్రభుత్వంలో పేదలకు ఆరోగ్య భరోసా కల్పించారు.

-జి. దావీదు, ఆరోగ్యశ్రీ లబ్ధిదారు, పార్వతీపురం పట్టణం

ఆపద సమయంలో ఆదుకున్నారు



ఆరోగ్యశ్రీ మాలాంటి పేదలకు వరం. సీఎం జగనన్న పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఆరు నెలల క్రితం నాకు యాక్సిడెంట్ అయింది. చేతికి ఆపరేషన్ అవసరం అవుతుందని వైద్యులు తెలిపారు. సుమారు రూ.25 వేల వరకు ఖర్చవుతుంద న్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళ్లి ఉచితంగా చికిత్స చేయించుకున్నాను. నాలాంటి పేదలకు ఆరోగ్యశ్రీ ఎంతగానో ఉపయోగపడుతోంది.

సిల్లా అనిల్, లబ్ధిదారు, 10వ వార్డు, పార్వతీపురం పట్టణం

మద్యం అమ్మకాలపై ప్రత్యేక నిఘా

- 5కేసుల నమోదు, 8 మంది అరెస్ట్
- ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్

పార్వతీపురం టౌన్: మద్యం అక్రమ అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పార్వతీపురం మన్యం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో గల 53 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 8 బార్లలో అమ్మకాలను పరిమితులకు లోబడి సీసీటీవీ నిఘాలో పర్యవేక్షిస్తున్నామన్నారు. ఐఎంఎఫ్ఎల్ డిపో నెల్లిమర్ల, ఇచ్చాడ నుంచి జీపీఎస్‌తో అనుసంధానించిన వాహనాల ద్వారా మద్యం సరఫరా జరుగుతున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నిర్వహించిన దాడుల్లో భాగంగా 5కేసులు నమోదు చేసి 8 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.46,250 విలువగల 253 మద్యం సీసాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహించిన షాపుల్లో పనిచేస్తున్న 1 సూపర్‌వైజర్, నలుగురు సేల్స్‌మెన్‌ను విధుల నుంచి తొలగించామన్నారు. ఎక్సైజ్ నేరాలు, ఫిర్యాదులపై సమాచారానికి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాచారం ఉన్నవారు ఫోన్ 9392679980, 8500900923 నంబర్లకు కాల్ చేసి ఎక్సైజ్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులు చేయవచ్చని పిలుపునిచ్చారు. మద్యం అక్రమ అమ్మకాలపై ఎక్సైజ్, ఎస్ఈబీ శాఖల సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పీడిక రాజన్నదొర

పాచిపెంట: మండలంలోని కర్రివలస గ్రామానికి చెందిన సుమారు 20 మంది జనసేన పార్టీ యువత శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర వారికి కర్రివలస గ్రామంలో పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.

అందరూ సమష్టిగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంగన్నపాడులో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పశువుల శాలలు

తెర్లాం: మండలంలోని గంగన్నపాడులో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పశువుల శాలలు దగ్ధం కావడంతో పాటు, ఓ ఆవు మృతి చెందింది. మరొక ఆవు తీవ్రంగా గాయపడింది. శుక్రవారం అర్ధరాత్రి స్థానిక రైతు భరోసా కేంద్రానికి దగ్గరలో ఉన్న కోట సింహాచలం, కోట సత్యం, కోట సరోజిని, కొత్తకోట సత్యనారాయణలకు చెందిన పశువుల శాలలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. ఈ ప్రమాదంలో కోట సింహాచలంకు చెందిన ఒక ఆవు మృతి చెందగా.. మరొక ఆవు తీవ్రంగా గాయపడింది. పశువుల శాలలు కాలిపోతున్నాయని తెలుసుకున్న సంబంధిత రైతులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆదుపు చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి సిబ్బందిని పంపించి నష్టాన్ని అంచనా వేయించారు.

బాధితులను ఆదుకుంటా...

అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని గంగన్నపాడు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాద విషయం తెలుసుకొని ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి బాధిత రైతులను పరామర్శించారు.

ఎన్నికల వేళ వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు



విజయనగరం: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సార్వత్రిక ఎన్నికల సమరం దగ్గరపడుతున్న వేళ అధికార వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు ఊపందుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పాలన, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన 10వ డివిజన్ గెడ్డ వీధికి చెందిన 100 కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలకు గుడ్ బై చెప్పి శనివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారందరికీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్ర స్వామి మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో పార్లమెంట్ సభ్యులుగా బెల్లన చంద్రశేఖర్‌కు, శాసనసభ్యులుగా తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన రమణ మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో కోలగట్లను గెలిపిస్తామని మాట ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాల చేరిక



నెలివాడలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సమక్షంలో శనివారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పెంద్యాల రామకృష్ణ, సూరినాయు డు, నెట్టి గురునాయుడు, సురేష్, గురు రామోజీ, కొమ్మ సూర్యనారాయణ, కొమ్మ ఆదిబాబు, పెంద్యాల ఎరుకునాయుడు, సూర్యప్రకాశరావు, కొమ్మ సత్యనారాయణ, నారం నాయుడు, మన్నా రాము, గోండ్యాల రమణమూర్తి, నెట్టి ఆదినారాయణ, షేక్ రహమాన్, మామిడి కనకరావు, కోర్నాన అగ్గిరాముడు, పైడితల్లి, చుక్క శివరాం, గౌరినాయుడు, సత్తిబాబు, కోలుసు చిన్నారావు, పట్నాన రాము, శ్రీను, కోన గంగ, నెట్టి చిన గురునాయుడు, బడిబట్ల అచ్యుతరావు, కొమ్మ రమణమూర్తి, కొమ్మ కృష్ణ, అప్పారావులు పార్టీలో చేరారు.

మేమంతా వైఎస్సార్‌సీపీతోనే ఉంటాం..



బొబ్బిలి: వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు

బొబ్బిలి: సంక్షేమానికి చిరునామా అయిన వైఎస్సార్ సీపీతోనే తాముండాలని నిర్ణయించుకున్నట్టు మండలంలోని ముత్తాయవలస గ్రామానికి చెందిన బలగ ఆదిత్య కుమార్ తదితరులు అన్నారు. గ్రామానికి చెందిన దాదాపు 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్వతీపురం పరిశీలకులు తూముల భాస్కరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రగతిరథ చోదకులకు వాహనమిత్ర

- వేలసంఖ్యలో ఉన్న డ్రైవర్లకు చేకూరనున్న లబ్ధి



సాలూరు:

దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రగతిలో రవాణా రంగానిదే కీలకపాత్ర. అందులో లారీలు ప్రముఖ స్థానం. ఆ లారీలు నడుపుతున్న డ్రైవర్ల కష్టాలు వర్ణనాతీతం. రాష్ట్రాలు దాటి రోజుల పాటు వాహనాలను నడుపుతున్న డ్రైవర్లకు జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలవనున్నారు. ఇప్పటివరకు వాహన మిత్ర పథకం కింద అర్హులైన ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఒక్కొక్కరికీ ఏటా రూ.పదివేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో ఏడాదికి రూ.10 వేలు చొప్పున రూ.50వేలు అందించారు. తాజాగా జగన్ మోహన్‌రెడ్డి తన మేనిఫెస్టోలో వాహనమిత్ర పథకాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు టిప్పర్, లారీ డ్రైవర్లకూ వాహన మిత్ర పథకం వర్తింపచేయనున్నారు. అంతేకాకుండా ప్రగతిరథ చోదకులైన డ్రైవర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో సాలూరు రెండవ స్థానం

రాష్ట్రంలో విజయవాడ తరువాత రెండవ అతిపెద్ద లారీ పరిశ్రమ ఉన్నది సాలూరులోనే. స్థానికంగా క్వారీలు ఉండడంతో టిప్పర్‌లు కూడా ఎక్కువగానే తిరుగుతున్నాయి. సుమారు 2 వేలకు పైగా లారీలు ఉండగా డ్రైవర్‌లు వేల సంఖ్యలోనే ఉన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా లారీ, టిప్పర్ డ్రైవర్లకు వాహన మిత్ర పథకం వర్తింపచేయనుండడంతో వేలాది మంది డ్రైవర్లకు లబ్ధి చేకూరనుంది. అంతేకాకుండా ప్రగతిరథ చోదకులైన డ్రైవర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమాను అధికారంలోకి రాగానే కల్పించనున్నామని వైఎస్సార్‌సీపీ ప్రకటించింది.

మా గురించి ఆలోచించిన ఏకైక నాయకుడు



లారీ డ్రైవర్ల గురించి ఇంతవరకు ఏ నాయకుడూ ఆలోచించలేదు. మా డ్రైవర్ల గురించి ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. లారీ డ్రైవర్లకు వాహన మిత్ర పథకం వర్తింపజేస్తామనడం ఆనందంగా ఉంది.ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

యుగంధర్, లారీ డ్రైవర్, సాలూరు

ముఖ్యమంత్రి చాలా మంచిచేస్తున్నారు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చాలా మంచిచేస్తున్నారు. టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చాడంటూ చంద్రబాబు అవహేళన చేయడం చాలా బాధ కలిగించింది. మా డ్రైవర్లంటే చంద్రబాబుకు అంత చిన్న చూపా? మా డ్రైవర్ల బాధలను అర్థం చేసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేము. జగన్ అనేక సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరింది. ఇచ్చిన మాట ప్రకారం మా లారీ, టిప్పర్ డ్రైవర్లకు వాహనమిత్ర వర్తింపచేస్తారన్న నమ్మకం మాకు ఉంది.

- శ్రీనివాసరావు, లారీ డ్రైవర్, సాలూరు

క్లుప్తంగా

ఫెసిలిటేషన్ కేంద్రాల తనిఖీ

- ఓటింగ్‌కు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశం
- అన్ని కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు



జేఎన్‌టీయూ జీవీ ప్రాంగణంలోని ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్, తదితరులు

విజయనగరం అర్బన్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. దీని కోసం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. ఓటింగ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె ముందుగా ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఏర్పాట్లపై ఆర్‌ఓ మురళీకృష్ణను ఆరా తీశారు. పోస్టల్ ఓటింగ్ కోసం పక్కగా ఏర్పాట్లు చేయాలని, వేగంగా ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజయనగరం జేఎన్‌టీయూ జీవీ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు ఫెసిలిటేషన్ సెంటర్లను సందర్శించారు. హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి, ఓటు వేయడానికి వచ్చే ఉద్యోగులకు అవసరమైన సమాచారాన్ని సహాయ సహకారాలను అందించాలని ఆదేశించారు. ప్రతిచోటా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర కనీస మౌలిక సదుపాయాలు ఉండాలని సూచించారు. ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎక్కడా ఇబ్బంది పడకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయనగరం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్, డీఆర్వో ఎస్.డి.అనిత, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, ఏఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 18,631 పోస్టల్ బ్యాలెట్లు

- నేటి నుంచి 7వ తేదీ వరకు ఎన్నికల విధుల్లో ఉన్నవారు వినియోగించుకునే అవకాశం
- 8 నుంచి 10వ తేదీ వరకు అత్యవసర సేవల ఉద్యోగులకు...



ఫెసిలిటేషన్ కేంద్రంలోని పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్లు ఇలా...

నియోజకవర్గం	పోస్టల్ బ్యాలెట్లు
బొబ్బిలి	2,105
చీపురుపల్లి	1,405
గజపతినగరం	1,655
నెల్లిమర్ల	1,525
విజయనగరం	3,975
ఎస్.కోట	1,776
రాజాం	1,741

విజయనగరం అర్బన్: పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటికే ఫారం–12 సమర్పించిన ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును ఆదివారం నుంచి 7వ తేదీ మధ్య వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ప్రకటించిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పీఓలు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, పోలీస్, ఆర్టీసీ ఉద్యోగులు, ఇతర జిల్లాల్లో ఓట్లు ఉన్నవారు, ఎసెన్షియల్ సర్వీసులో ఉన్నవారు, అత్యవసర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఓటు వేసుకునే అవకాశం ఉందన్నారు.



కురుపాం మండల కేంద్రం సమీపంలోని టేకరకండి గ్రామ సమీపంలో రూ.190 కోట్లతో నిర్మాణంలో ఉన్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల

కురుపాం.. అభివృద్ధి పథం

- కొండకోనల్లో ప్రగతి పవనాలు
- ఇంటింటా 'నవరత్న' కాంతులు
- సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ
- 58 నెలల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి ఇంటా ఆర్థిక సంక్షేమం
- వివిధ సంక్షేమ పథకాల కింద 6,15,529 మందికి రూ.1700 కోట్ల ప్రయోజనం
- గిరిజన గూడల్లో అభివృద్ధి 'బాటలు'
- కురుపాం సిగలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల

అభివృద్ధి పథం సంక్షేమ రథం

మంచి నాయకులు పాలకులైతే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం ఏ స్థాయిలో సమకూరుతుందనేందుకు కురుపాం నియోజకవర్గమే నిలువెత్తు నిదర్శనం. కేవలం 58 నెలల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ వివిధ సంక్షేమ పథకాల కింద ఆర్థిక లబ్ధి చేకూరింది. ఇంటింటా 'నవరత్న' వికాసం స్పష్టంగా కనిపిస్తోంది. గిరిజన గూడల్లో విద్యా చైతన్యం వెల్లివిరిస్తోంది. గిరిజన ఉత్పత్తుల తరలింపునకు వీలుగా ప్రగతి 'బాటలు' కనిపిస్తున్నాయి. సాగుచేసిన భూమికి శాశ్వత హక్కుపత్రాలు చేతికందాయి. ఉన్నత విద్యకు ఆలంబనగా కురుపాం సిగలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మితమవుతోంది. ఇంటివద్దకే రేషన్, ఊరిలోనే అందుతున్న ప్రభుత్వ సేవలు, రైతు చెంతనే ఆర్‌బీకేలు, పశు ఆస్పత్రులు, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లు, ఫ్యామిలీ డాక్టర్ వైద్యం ఇలా.. ప్రజోపయోగ కార్యక్రమాలు కో కొల్లలుగా కళ్లముందే కనిపిస్తున్నాయి. అందుకే.. ప్రతినోటా.. పాలన అంటే ఇలా ఉండాలి అన్న నినాదం వినిపిస్తోంది. సంక్షేమ పాలనకు ఊరూరా మద్దతు లభిస్తోంది.

కురుపాం:

కురుపాం నియోజకవర్గం అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది. ప్రతి ఇంటా 'సంక్షేమ' సంతోషం కనిపిస్తోంది. ప్రతి గూడలోనూ అభివృద్ధి పనులు కళ్ల ముందే సాక్షాత్కరిస్తున్నాయి. సెల్ సిగ్నల్స్ సమస్యలు తొలగాయి. ప్రభుత్వ సేవలు అక్కరకు వచ్చాయి. విద్య, వైద్య సదుపాయాలు అందుతున్నాయి. రోడ్ల పనులు దశలవారీగా జరుగుతుండడంతో రాకపోకల సమస్యలు తొలగుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేవలం 58 నెలల పాలనలో నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నిలిపింది. స్థానిక పాలకుల ప్రత్యేక కృషి, చొరవతో కురుపాం నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రత్యేకత సంతరించుకుంది. నాడు.. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసినా ఏ నాడూ కురుపాం వైపు కన్నెత్తి చూడలేదు. ఇక్కడి ప్రజల బాగోగులు పట్టించుకోలేదు. సెల్ సిగ్నల్స్ లేక విద్య, వైద్యసేవలు అందడంలేదని, దూర ప్రాంతంలో ఉన్న కుటుంబ సభ్యులతో కనీసం మాట్లాడేందుకు కూడా అవకాశం లేదని, సెల్ టవర్లు ఏర్పాటుచేసి సిగ్నల్స్ సమస్యలు తొలగించాలని నియోజకవర్గ ప్రజలు వేడుకున్నా కనికరించలేదు. ఇక్కడి ప్రజలను ఎన్నికల వేళ ఓట్లకోసం వాడుకున్నారే తప్ప వారికి ఒక్క సంక్షేమ కార్యక్రమాన్ని చేపట్టలేదన్నది ఈ ప్రాంతీయు వాదన. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాకతో 58నెలలుగా ప్రతీ ప్రభుత్వ పథకమూ అందిందని, ఆర్థిక లబ్ధి నేరుగా బ్యాంకు ఖాతాలకే జమైందని, పిల్లల చదువులు బాగుపడ్డాయని, పైసా ఖర్చులేకుండా ఊరిలో ఉన్న సచివాలయంలో ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఆనందంగా చెబుతున్నారు. మా కోసం ఈ స్థాయిలో పనిచేసిన ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదంటూ, తమకు కలిగిన మేలును రచ్చబండలపై గర్వంగా వివరిస్తున్నారు. కురుపాం నియోజకవర్గ ప్రజలకు సుమారు ఐదేళ్లలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.1700 కోట్ల ప్రయోజనం కల్పించిన ఘన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనని పేర్కొంటున్నారు. వివిధ అభివృద్ధి పనులకు రూ.1045 కోట్లను వెచ్చించడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కురుపాం మండలం బియ్యాలవలసలోని గ్రామ సచివాలయం



కురుపాం మండలం గొటివాడలోని రైతు భరోసా కేంద్రం నిర్మాణం



రూ.36.27 కోట్లతో జియ్యమ్మవలస మండలం గెడ్డతిరువాడ నుంచి నిర్మించిన బ్రిడ్జికమ్ రోడ్డు

అందుబాటులో ఇంజినీరింగ్ విద్య

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కురుపాం నియోజకవర్గ కేంద్రంలోని టేకరఖండి గ్రామ సమీపంలోని 105 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.190 కోట్ల అంచనా వ్యయంతో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మిస్తోంది. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. కళాశాల అందుబాటులోకి వస్తే పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం, పార్వతీపురం, పాలకొండ, సాలూరు నియోజకవర్గ విద్యార్థులకు స్థానికంగానే నాణ్యమైన ఇంజినీరింగ్ విద్య అందనుంది. గిరిజన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కలగనుంది.

రాజకీయ చరిత ఇలా..

2014 ఎన్నికల్లో నియోజకవర్గంలోని మొత్తం 1,76,271 మంది ఓటర్లు ఉండగా అందులో 1,31,177 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణికి 56,435 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి జనార్థన్ థాట్రాజ్‌కు 36,352 ఓట్లు వచ్చాయి. టీడీపీ రెబల్ అభ్యర్థిగా బరిలో దిగిన నిమ్మక జయరాజుకు 24,044 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో పుష్పశ్రీవాణి 19,083 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో రెండో దఫా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో దిగిన పుష్పశ్రీవాణి టీడీపీ అభ్యర్థిని నరిసింహప్రియా థాట్రాజ్‌పై 26,602 ఓట్లతో గెలుపొందారు. నియోజవకర్గ ప్రజల మనసులు గెలుచుకున్న ఆమె ముచ్చటగా మూడోసారి విజయం సాధించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

కురుపాం నియోజకవర్గంలో 2019-2023 మధ్య లబ్ధిదారులకు కలిగిన 'ఆర్థిక సంక్షేమం' ఇలా..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	4,456	247.22
సున్నావడ్డీ పంట రుణాలు	26,659	291
వైఎస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్	10,636	36.786
వైఎస్సార్ యంత్రసేవా	481	2.54
వైఎస్సార్ పశునేస్త పరిహార పథకం	401	0.943
జగనన్న పాలవెల్లువ	1672	12.54
జగనన్న జీవక్రాంతి	2101	15.755
టీఎంఆర్ (కేటల్ ఫీడ్)	223	0.085
చాప్ కట్టర్	8	0.0112
వైఎస్సార్ పశు బీమా	1654	2.1067
ఎక్స్‌గ్రేషియా ఫిషర్‌మ్యాన్	1	0.1
జగనన్న గోరుముద్ద	37,050	32.51
జగనన్న అమ్మ ఒడి	1,57,863	236.78
జగనన్న విద్యాకానుక	1,47,739	32.97
వైఎస్సార్ పెన్షన్ కానుక	39,956	379.79
వైఎస్సార్ చేయూత	18,993	97.05
జగనన్న తోడు	16,511	16.511
వైఎస్సార్ సున్నావడ్డీ	4,977	11.12
బ్యాంకు లింకేజీ	9,446	60.496
వైఎస్సార్ ఆసరా	4,127	21.022
ఉన్నతి (ఎస్సీఎస్పీ/టీఎస్పీ)	1569	7.845
వైఎస్సార్ బీమా	976	24.42
స్త్రీనిధి	9,323	38.68
జగనన్న విద్యాదీవెన	21,669	32.84
జగనన్న వసతి దీవెన	17,203	16.34
పాస్టర్స్ గౌరవ వేతనం	28	0.1365
ఇమామ్/మోజామ్స్	2	0.0924
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	17,177	32.85
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	4,035	20.41
జగనన్న సురక్ష యోజన	2486	0.249
వైఎస్సార్ వాహన మిత్ర	4971	4.971
జగనన్న చేదోడు	8409	8.4
వైఎస్సార్ కాపు నేస్తం	643	0.96
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	190	0.28
వైఎస్సార్ నేతన్న నేస్తం	62	0.744

గిరిజన రైతులకు 'పట్టా'భిషేకం

కురుపాం నియోజకవర్గంలో మొదటి విడతలో 5,295 ఎకరాల విస్తీర్ణానికి 4014 మందికి డీకేటీ పట్టాలను ప్రభుత్వం అందించి భూ హక్కు కల్పించింది. రెండో విడతలో 829.50 ఎకరాల్లో 1070 డీకేటీ పట్టాలు అందించి రైతులకు వెన్నదున్నుగా నిలిచింది. గిరిజనులపై ఉన్న అభిమానం తో ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లాలో 54 వేల కొండపోడు పట్టాలు అందించారు. గిరిజన రైతులందరికీ వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందించారు.

కురుపాం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ఇలా..

- 1976 తర్వాత అభివృద్ధికి నోచుకోని వట్టిగెడ్డ జలాశయం పనులకు రూ.44.85 కోట్లు మంజూరు
- నాడు–నేడు మొదటి విడతలో రూ.44.23 కోట్ల ఖర్చుతో 182 పాఠశాలలకు ఆధునిక సొబగులు. రెండో విడతలో 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రూ.7.09 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాల కల్పన.
- రూ.3కోట్ల వ్యయంతో కురుపాం సీహెచ్‌సీకి అదనపు గదుల నిర్మాణం, రూ.8.95 కోట్లతో గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సామాజిక ఆరో గ్య కేంద్రంలో నూతన భవనాల నిర్మాణం
- కురుపాం మూలిగూడ రోడ్డు నుంచి బీరుపాడు రోడ్డు వరకు రూ.15.54 కోట్ల వ్యయంతో పూర్తయి న రోడ్డు నిర్మాణం
- గరుగుబిల్లి మండలం తోటపల్లి (పాతబ్రిడ్జి) నుంచి కురుపాంవరకు రూ.33కోట్లతో రోడ్డు నిర్మాణం.
- రూ.5.33 కోట్లతో కొమరాడ మండలంలోని విక్రంపురం నుంచి కంచరపాడుకు బీటీ రోడ్డు సదుపాయం.
- రూ.6.55 కోట్లతో గుమ్మలక్ష్మీపురం మండలంలోని దేరువాడ నుంచి జర్న గ్రామానికి రహదారి సౌకర్యం
- జియ్యమ్మవలస మండలంలోని గెడ్డతిరువాడ నుంచి పెద్దబుడ్డిడి, అంకవరం, రావివలస (వట్టిగెడ్డపై చినబుడ్డిడి నుంచి పెద్ద బుడ్డిడి బ్రిడ్జి)కు 6.27 కోట్లతో రోడ్డు నిర్మాణం
- కొమరాడ మండలంలోని పూర్ణపాడు–లాబేసు వంతెన నిర్మాణానికి టీఎస్పీ గ్రాంట్ నుంచి అదనంగా రూ.7 కోట్లు మంజూరు చేయించి రూ.14 కోట్లతో బ్రిడ్జ్ నిర్మాణానికి చర్యలు
- రూ.80 లక్షల ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులతో కురుపాం మండలంలోని బీంపురం వద్ద వంతెన నిర్మాణం. దీనివల్ల పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని వందల సంఖ్యలో గిరిజన ప్రజలకు అక్కరకు వచ్చిన విద్య, వైద్య సదుపాయాలు. అటవీ ఫలసాయాల తరలింపునకు రోడ్డు సదుపాయం.



రూ.80 లక్ష ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులతో బీంపురం వద్ద నిర్మించిన వంతెన



రూ.33 కోట్లతో తోటపల్లి బ్రిడ్జ్ నుంచి కురుపాం వరకు నిర్మించిన రోడ్డు



కురుపాం మండలం గొటివాడ గిరిజన గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్



కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ.3 కోట్లతో అదనపు గదుల నిర్మాణం

మా కొద్దు 'బాబూ' ఈ పింఛన్ కష్టాలు..!



తెర్లాం ఎస్‌బీఐలో పెన్షన్ డబ్బుల కోసం ఆరా తీస్తున్న పెన్షన్‌దారులు

- చంద్రబాబుకో దండం
- మమ్మలను కష్టపెట్టారంటూ ఆవేదన
- నాలుగోరోజు తప్పని నిరీక్షణ
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు

తెర్లాం: ప్రతినెలా ఒకటో తేదీనే వలంటీరు వచ్చి పింఛన్ అందించేవారు.. ఆ మాయదారి చంద్రబాబుకు ఏమయిందో.. మాకు పింఛన్ అందకుండా కష్టాలు పాల చేశారంటూ ఓ వృద్ధురాలి శాపనార్థాలు.. చంద్రబాబు పాలనలో కష్టాలు పడ్డాం.. అవే కష్టాలు మాకు ఇప్పుడు మళ్లీ చూపిస్తున్నారంటూ ఓ వితంతువు ఆవేదన.. పింఛన్ ఇంటివద్దనే ఇస్తే కలిగే నష్టం ఏమిటి 'బాబూ' అంటూ ఓ వృద్ధుడి ప్రశ్న... బ్యాంకుల వద్దకు వెళ్తే పింఛన్‌దారుల పాట్లు కళ్లకు కడుతున్నాయి. వారి గోడు వినిపిస్తోంది. నాలుగోరోజు శనివారం కూడా పింఛన్‌దారులకు అవస్థలు తప్పలేదు. సుమారు 58 నెలలుగా ఇంటివద్దనే చక్కగా పింఛన్ అందేదని, చంద్రబాబు, ఆయన మనుషులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్లే నాలుగు రోజులుగా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందంటూ వాపోతున్నారు. మళ్లీ సీఎంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే తమ కష్టాలు ఉండవని అవ్వాతాతలు ఆశాభావం వ్యక్తంచేశారు.

తప్పని నిరీక్షణ



చిత్రంలో పింఛన్ డబ్బుల కోసం వేచి ఉన్నది గజపతినగరం మండలంలోని కె.ఎస్.ఆర్.పురం, లోగిశ, ముచ్చర్ల, తుమికాపల్లి, కెంగువ గ్రామాలకు చెందిన వృద్ధులు, వితంతువులు. పింఛన్ డబ్బులు తీసుకునేందుకు గజపతినగరం మండలం కొత్తశ్రీరంగరాజపురం గ్రామంలోని యూనియన్ బ్యాంకుకు శనివారం వచ్చారు. గంటల తరబడి నిరీక్షించారు. గతంలో ప్రతినెలా వలంటీరు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారని, చంద్రబాబు అండ్ కో ఫిర్యాదుతోనే మాకు ఈ కష్టాలు వచ్చాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

– గజపతినగరం

పెన్షనర్ల ఇబ్బందులకు చంద్రబాబే కారణం

- మంత్రి బొత్స సత్యనారాయణ



గరివిడి మండలం కోడూరు సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): మండుటెండల్లో పెన్షన్‌దారులు ఇబ్బందులు పడడానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. గరివిడి మండలంలోని కోడూరు, కొండలక్ష్మీపురం, తాటిగూడ, గెడ్డపువలస గ్రామాల్లో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోని వంద శాతం అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. నాలుగు సంవత్సరాల పది నెలల కాలంలో ప్రతి కుటుంబానికీ మేలు చేశామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దనే వలంటీర్లతో పింఛన్లు అందించామన్నారు. అయితే వలంటీర్ల వ్యవస్థపై కక్ష కట్టిన చంద్రబాబు అండ్ కో లేనిపోని ఫిర్యాదులతో ఈ నెల పెన్షన్లు ఇంటి వద్ద పంపిణీ చేయలేకపోయామన్నారు. బ్యాంక్ ఖాతాలకు జమ చేయడంతో అవ్వాతాతలు మండుటెండల్లో వెళ్లి నగదు తీసుకోవడానికి ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పాలన అందించిన జగన్ మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకులు చవకబారు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రజలంతా గమనించి విజ్ఞతతో వ్యవహరించి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎడ్ల అప్పారావు, ఎలకల అప్పలనాయుడు, లెంక శ్రీరాములు, వైస్ ఎంపీపీ శ్రీరాములనాయుడు, వలిరెడ్డి లక్ష్మణ, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యురాలు కొణిశ ఉమ, ఎడ్ల వెంకటలక్ష్మీరమణమ్మ, ఆయా గ్రామాల నాయకులు గేదెల ఆదినారాయణ, గేదెల శంకరరావు, గవిడి సన్యాసి, మీసాల ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.